

పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి


మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల

విజయనగరం ఫోర్ట్: పైడితల్లి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ఏపీ శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. పైడితల్లి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని, నగరంలో కొలువైన అమ్మవారిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, దైవదర్శనం బాగా జరిగేలా ఏర్పాట్లు ఉండాలని పోలీస్ సిబ్బందిని కోరారు. ఆయన వెంట విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, నాయకుడు ఈశ్వర్ కౌశిక్ తదితరులు ఉన్నారు.

ఓ వైపు విద్యుత్ కాంతులు.. మరోవైపు మెరుపులు


పైడితల్లి చదురుగుడి వద్ద విద్యుత్ వెలుగులు

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవ పండగ నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రం విద్యుత్ కాంతులతో ఓ వైపు మిరమిట్లుగొలుపుతుండగా.. ప్రకృతి కూడా మెరుపుల వర్షం కురిపించింది. దీనికి ఈ చిత్రాలే సాక్ష్యం.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం


అమ్మవారి ఆలయ గాలిగోపురం ప్రాంతంలో మెరుపులు

జాతరలో వైద్య శిబిరాల ఏర్పాటు


పైడితల్లి ఆలయం వద్ద భక్తులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: పైడితల్లి జాతర పురస్కరించుకుని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, పైడితల్లి ఆలయం, అంబటి సత్రం, కోట, అయోధ్య మైదానం తదితర ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అస్వస్థత బారినపడిన వారికి శిబిరాల్లో వైద్యసేవలు అందించారు. తక్షణ శక్తి కోసం ఓఆర్ఎస్ పంపిణీ చేశారు. అమ్మవారి ఆలయం వద్ద దర్శనానికి క్యూలైన్‌లో ఉన్న భక్తులకు రెడ్‌క్రాస్ వలంటీర్లు తాగునీరు అందించారు.

పైడితల్లికి పట్టువస్త్రాలు సమర్పించనున్న దేవదాయశాఖ మంత్రి

విజయనగరం టౌన్: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలలకు పైడితల్లి అమ్మవారిని దర్శించుకుంటారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. మంగళవారం ఉదయం విశాఖ పట్టణం నుంచి బయలుదేరి విజయనగరం చేరుకుని అమ్మవారి దర్శనానికి వస్తారని అధికారులు పేర్కొన్నారు.





ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


బాలికల కూచిపూడి నృత్య ప్రదర్శన


సంగీత కళాశాలలో సప్తస్వరాలయం వారి గాత్రకచేరీ


లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

విజయనగరం టౌన్: పైడితల్లి తొలేళ్ల సంబరాలు, విజయనగరం ఉత్సవాలు పురస్కరించుకుని నగరంలోని వివిధ వేదికలపై సోమవారం చేపట్టిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల కచేరీ మందిరంలో 293 మంది కళాకారులతో 36 సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శనలు చూపరులను ఆద్యంతం అలరించాయి. లేడీస్ క్లబ్ సాహితీ వేదికపై చేపట్టిన అష్టావధానం ఆసక్తికరంగా కొనసాగింది. లయన్స్ కమ్యూనిటీ హాల్, గురజాడ కళాభారతి వేదికలపై జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఏకాపాత్రాభినయం, నాటికలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి.

నెల్లిమర్ల: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలో చేపట్టిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో జరజాపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించి ప్రదర్శించిన గణిత ప్రాజెక్టు బెస్ట్ ప్రాజెక్టుగా ఎంపికైంది.

భోగాపురం: విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన, సాంస్కృతిక పోటీల్లో మండలంలోని ముంజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని, బహుమతులు కైవసం చేసుకున్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు


పైడితల్లి జాతర మహోత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్

విజయనగరం:

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర మహోత్సవాలు సందర్భంగా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మూడు లాంతర్ల జంక్షన్ సమీపంలో విపణికల్ప కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకుంది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులు ప్రజలకు తెలిసేలా వారి చిత్రాలను ప్రదర్శించారు. జాతరకు విచ్చేసిన వారంతా ప్రముఖుల ఫొటోలు చూసి వారి గూర్చి తెలుసుకునే ప్రయత్నం చేశారు.

































- నేడు సిరిమానోత్సవం
- ఆద్యంతం ఆసక్తి గొలిపే ఊరేగింపు
- మూడులక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- విజయనగరానికి పండగ శోభ
- ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- భారీగా పోలీస్ బందోబస్తు

సిరుల తల్లీ.. రావమ్మా...

విజయనగరం టౌన్: సిరులతల్లి సిరిమానోత్సవం పేరు వింటనే భక్తకోటి పరవశించిపోతుంది. ఆ అద్భుత ఘడియలను ఆస్వాదించేందుకు... సిరిమాను పూజారి రూపంలో వచ్చిన పైడితల్లిని కనులారా వీక్షించేందుకు పరితపిస్తుంది. ఆద్యంతం ఆసక్తిగొలిపే సిరిమానోత్సవానికి ఏటేటా ఆదరణ పెరిగిపోతోంది. రెండున్నర శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం జరగనుంది. లక్షలాది మంది భక్తజనం ఇప్పటికే విజయనగరం చేరుకుంది. ప్రతీ ఇల్లు పండగ శోభతో కళకళలాడుతోంది. ఒక్కమాటలో చెప్పాలంటే విజయనగరం వెలిగిపోతోంది.

ఒకప్పుడు గ్రామదేవత. ఇప్పుడు ఆమె అందరి దేవత. పైడితల్లి కీర్తి ఎల్లలు దాటింది. పసిడితల్లి కరుణాకటాక్షాల కోసం ఎక్కడెక్కడివారో సిరిమాను పండగ నాటికి విజయనగరం చేరుకుంటారు. సిరిమాను రథం ఊరేగింపు ప్రారంభమయ్యేసరికి మూడులాంతర్లు, రాజాబజారు, కోట కూడలికి చేరుకుంటారు. పూజారి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని తరిస్తారు. సిరిమానోత్సవం విజయవంతమయ్యేందుకు అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సిరిమానోత్సవంలో ప్రధానపూజారి బంటుపల్లి వెంకటరావు ఈ ఏడాది 9వసారి సిరిమానును అధిరోహించనున్నారు. రెండున్నర లక్షల నుంచి మూడున్నర లక్షల మంది భక్తులు తరలివస్తారని అంచనా.

అన్నీ రసవత్తర ఘట్టాలే....

భక్తులను విశేషంగా ఆకట్టుకునే సిరిమానోత్సవంలో అన్నీ రసవత్తర ఘట్టాలే. 55 అడుగుల పొడువున్న సిరిమాను ఉపరితలంతో బిగించే ఇరుసుపై ప్రధాన పూజారి వెంకటరావు విసనకర్ర చేతబట్టి ఆశీనులవుతారు. రెండో చివర రథంపై అమర్చిన ఇరుసుమానుకు అమరుస్తారు. దాని ఆధారంగానే మాను పైకి లేస్తుంది. గజపతిరాజ వంశీయులు తరఫున ఒకరు తాడు లాగడంతో ప్రారంభమయ్యే సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్ద గల పైడితల్లి అమ్మవారి గుడి వద్ద నుంచి రాజాబజారు మీదుగా కోట వరకు మూడుసార్లు తిరుగుతుంది. ఊరేగింపు ఆద్యంతం విసనకర్ర విసురుతూ కనిపించే సిరిమాను పూజారిని భక్తులు అరటిపండ్లతో కొలుస్తారు.

అత్యంత నియమ నిష్టలతో...

అత్యంత నియమనిష్టలతో ఉపవాసం ఉండే సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు హుకుంపేటలోని మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరుతారు. కాలినడకన వేలాది మంది భక్తుల సందడితో ఊరేగింపుగా వస్తారు. దారిపొడుగునా ప్రజలు పూజారి రూపంలో ఉన్న అమ్మవారి పాదాలపై పసుపునీళ్లు పోసి దీవెనలు అందుకుంటారు. చంటిపిల్లలపై నుంచి పూజారి దాటితే వారికి మేలు జరుగుతుందన్న నమ్మకంతో చాలామంది ఆయనవచ్చే దారిలో వారిని నేలపై ఉంచుతారు. పూజారి చేరుకున్నాకే సిరిమానోత్సవం ప్రారంభమవుతోంది. 260 ఏళ్ల



చరిత్ర కలిగిన సిరిమాను చదురుగుడి నుంచి మహారాజ కోట వరకు మూడు పర్యాయాలు తిరిగి భక్తులను ఆశీర్వదించనుంది. సిరిమాను ముందుండే బెస్తవారి వల, పాలధార, తెల్ల ఏనుగు, అంజలిరథాలు ఆకర్షణీయంగా నిలుస్తాయి.

బెస్తవారి వల...

రెండున్నర శతాబ్దాలకు మునుపు అమ్మవారు పెద్ద చెరువులో నిక్షిప్తమైనప్పుడు కలలో అమ్మవారు చెప్పిన ప్రకారం పైడితల్లి మూలవిరాట్‌ను చెరువు గర్భంనుంచి వెలికితీయడంలో విజయనగరం యాతవీధికి చెందిన జాలర్లు సహకరించారు. అమ్మ సాక్ష్యాత్కారానికి ఆదిలోనే పాత్రులైన ఆ బెస్తలే కీలకంగా వ్యవహరించారు. నాటి నుంచి ఏటా ఈ వలను యాతవీధి జాలర్లు తయారుచేస్తుంటారు. చేపల వేటకెళ్లేటప్పుడు వాడే ప్రతి వస్తువునూ వీరంతా ఒంటికి పసుపు రాసుకుని, వేపకొమ్మలు, జాలరి వస్తువులను చేతబట్టి సంబరంలో ఉత్సాహంగా ముందుకు సాగుతారు.

పాలధార

సిరిమాను సంబరం ప్రారంభానికి ముందు పాలధార ఆలయానికి రావడం అనాదిగా వస్తున్న ఆచారం. జాలరి వలను వెన్నంటి ఈటెలు చేతపట్టి వచ్చే ఈ జనం మహాశక్తి స్వరూపాలుగా భావిస్తారు. పాలధారగా పిలిచే ఈ జనధార అమ్మవారి సైనిక శక్తికి వారసులంటారు. తొలుత కొందరు ఈటెలను ధరించి అమ్మవారి ఆలయానికి వస్తారు. అక్కడ పైడిమాంబను దర్శించుకున్న అనంతరం డప్పు వాయిద్యాలతో కోట వద్దకు చేరుకుంటారు. అక్కడ పూజలు చేసిన అనంతరం కోట పశ్చిమభాగం వైపు వెళ్లి కోట శక్తికి నమస్కరిస్తారు. సైనికులుగా పనిచేసే వీరంతా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న భావనతో గ్రామ కట్టడిని చేస్తారు. ఈ ఘట్టంలో సాకేటివీధికి చెందిన డోకుల, మండల, అలుగోలు, రామవరపు కుటుంబ సభ్యులు పాల్గొంటారు.

అంజలి రథం

సిరిమాను జాతరలో అంజలిరథానిది విలక్షణమైన స్థానం. సిరిమానుకు అంజలి ఘటిస్తూ ముందుకు సాగుతుంది కాబట్టి దీన్ని అంజలి రథమని పిలుస్తారు. అంజలి అంటే నమస్కారం. పైడిమాంబను నమస్కరిస్తూ అంజలిరథంపై ఉన్న నడిపేన, కోరాడ కుటుంబాల వాళ్లు ముందుకు సాగుతారు. నాటుబండిపై రోలును బిగించి దానికి అటూ, ఇటూ రాటలను కడతారు. దానిపై ఐదుగురు పురుషులు మహిళల వేషధారణలో కూర్చొంటారు. వీరంతా ఆరుమూరల నారచీరను చేతికి వెండి సందెలను ధరిస్తారు. సంబరం ప్రారంభానికి ముందు ఊరేగింపుగా చదురుగుడి వద్దకు వస్తారు. వీరంతా అమ్మవారి పరిచారికలుగా వ్యవహరిస్తారు. సంబరం జరుగుతున్నంతసేపూ భక్తులపై అక్షితలు విసురుతుంటారు. ప్రతిగా భక్తులు భక్తిభావంతో అరటిపండ్లను వారిపై విసురుతుంటారు.

తెల్ల ఏనుగు

పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరంలో తెల్ల ఏనుగుకు విశిష్ట స్థానం ఉంది. పూసపాటిగజపతులు ముస్తాబు చేసిన అంబారీ ఏనుగుపై కూర్చొని సంబరంలో పాల్గొనేవారు. సిరిమానుకు ముందు పట్టపుటేనుగు నడిచేది. రాచరికం అంతరించి, ప్రజాస్వామ్యం వచ్చాక పట్టపుటేనుగునకు గుర్తుగా 1956 నుంచి ఏనుగు ఆకారంలో ఒక బండిని ప్రదర్శిస్తున్నారు. ఈ ఏనుగుపై ఒక పురుషుడు, ఏడుగురు పురుషులు స్త్రీ వేషధారణలు ధరించి కూర్చొంటారు. వీరంతా పైడితల్లమ్మకు అక్కాచెల్లెళ్లైన గ్రామదేవతలుగా, మగవేషంలో ఉన్న వ్యక్తి అమ్మవారి సోదరుడు పోతురాజుగా భావిస్తారు. వెదురుతో తయారైన ఈ ఏనుగుపై భోగాపురం, పెద్దింటి తదితర కుటుంబాలకు చెందిన సభ్యులు కూర్చొంటారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలి



బంగారమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కోరారు. మండలంలోని పారసాం గ్రామంలో సోమవారం జరిగిన బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన..అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, అందరూ దైవ నామస్మరణకు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు



అయోధ్య మైదానం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి పంపిణీ కేంద్రం



భక్తుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లు

విజయనగరం: పైడితల్లి జాతరకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే చోట తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పైడితల్లి ఆలయం, గంటస్తంభం, ఎన్సీఎస్, ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ జంక్షన్, అయోధ్య మైదానం, సంగీత కళాశాల, లేడీస్ క్లబ్ తదితర 15 ప్రాంతాల్లో తాగునీటి సరఫరా కేంద్రాలు, రాజీవ్ స్టేడియం తదితర ప్రాంతాల్లో 60 తాత్కాలిక మరుగుదొడ్లు ఉంచామన్నారు.

భక్తుల భద్రతే లక్ష్యంగా చర్యలు

విజయనగరం క్రైమ్: భక్తుల భద్రతే లక్ష్యంగా చర్యలు తీసుకున్నామని ఎస్పీ దామోదర్ తెలిపారు. విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జారత మహోత్సవం పురస్కరించుకుని చేసిన ఏర్పాట్లపై ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. తొలేళ్ల సంబరం, సిరిమానోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేశామన్నారు. అనంతరం క్షేత్ర స్థాయిలో భద్రతా ఏర్పాట్లను ఆయన పరిశీలించి, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నగరంలోని మూడు లాంతర్లు, కోట, హుకుంపేట, పోలీస్ కంట్రోల్ రూమ్‌లను ఆయన పరిశీలించి, ఉగ్రవాద చర్యలు, జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పక్కాగా పోలీసుల పర్యవేక్షణ ఉండేలా జాగ్రత్త వహించామన్నారు. భక్తుల భద్రత చర్యల పర్యవేక్షణకు 120 సీసీ కెమెరాలు, 12 డ్రోన్‌లతో నిఘా పెట్టామన్నారు. రాత్రి వేళల్లో కూడా 2 కిలోమీటర్ల దూరం వరకు లైవ్ విజువల్స్‌ను రికార్డు చేసే ప్రత్యేక డ్రోన్‌లను వినియోగిస్తున్నామన్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లు కూడా బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నారన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా చూస్తున్నామన్నారు. ఆయన వెంట అడిషనల్ ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, డీఎస్పీ గోవిందరావు, సీఐలు చౌదరి, శ్రీనివాస్ ఉన్నారు.



పైడితల్లి చదురుగుడి వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్ తదితరులు

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబును వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి దవళ లక్ష్మణరావు మండలంలోని మొయిద గ్రామంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన



ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన వారికి బహుమతులు అందజేస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు



వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాలు సందర్భంగా స్థానిక కోటలో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సోమవారంతో ముగిసింది. రెండో రోజు ప్రదర్శనను గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు సందర్శించి, ప్రాజెక్టుల గూర్చి విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 166 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సహా పలు ఐటీఐల నుంచి విద్యార్థులు విచ్చేసి, మొత్తం 234 ప్రాజెక్టులను ప్రదర్శించారు. అత్యుత్తమ ప్రాజెక్టులుగా నిలిచిన వాటికి డీఈవో యు.మాణిక్యంనాయుడు చేతులమీదుగా జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

900 మందితో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: సిరిమాను ఎజాతరలో భాగంగా నగరంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించినట్టు కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. 900 మంది ప్రత్యేక పారిశుద్ధ్య కార్మికులతో ఎప్పటికప్పుడు రహదారులు, వీధులు శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టేలా ఆదేశించామన్నారు. ప్లాస్టిక్ రహిత జాతరగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎక్కడా ప్లాస్టిక్ సంచులు, పాలిథిన్ కవర్లు వినియోగించవద్దని సూచించారు. ప్రసాదాల వితరణ కేంద్రాల నిర్వహకులు కూడా ప్లాస్టిక్ రహిత వస్తువులను మాత్రమే వినియోగించాలని చెప్పారు. అందరి సహకారంతో స్వచ్ఛ జాతరగా జరుపుకుందామని ఆకాంక్షించారు.

పారదర్శకంగా భూముల రీసర్వే చేపట్టాలి



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న మండల సర్వేయరు గణపతిరావు

పూసపాటిరేగ: పారదర్శకంగా భూముల రీసర్వే చేపట్టాలని మండల సర్వేయరు గణపతిరావు సూచించారు. మండలంలోని కొల్లాయివలస గ్రామంలో జరుగుతున్న సర్వేను ఆయన సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద ఉండి హద్దులు చెప్పాలని తెలిపారు. సర్వేలో తప్పులు రాకుండా అధికారులకు పక్కా సమాచారం ఇచ్చి, సహకరించాలని కోరారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నాయకులు, అధికారులు

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ధరలు దిగివచ్చాయని, ముఖ్యంగా వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ట్రాక్టర్లు, వాటి విడిభాగాల ధరలు బాగా తగ్గాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో శ్రీలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ గాయత్రి ,వ్యవసాయ శాఖ జేడీ భారతి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, తహసీల్దారు శ్రీకాంత్, ఎంపీడీవో రామకృష్ణంరాజు, ఏడీఏ కోటేశ్వరరావు, నగరపంచాయతీ కమిషనర్ జయరాం, ఏవో సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తూ చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. కొత్త శ్లాబ్‌ల వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయుడు సత్యప్రకాష్ తెలిపారు.

పైడితల్లమ్మా.. వారికి సద్బుద్ధి ప్రసాదించు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు జిల్లా రైతుసంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు, విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు జరుగుతుండడంతో అమ్మవారి చిత్రపటం పట్టుకుని నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ 108 రోజులుగా శాంతియుంగా పోరాటం చేస్తున్నామని, అయినా తమసమస్యపై ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వారికి సద్బుద్ధి ప్రసాదించాలని పైడితల్లి అమ్మవారిని వేడుకున్నారు.

యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారు

- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ గోపమ్మ

కొత్తవలస: గతంలో ఎన్నడూ లేదని విధంగా యూరియా కృత్రిమ కొరత సృష్టించి వ్యవసాయ అధికారులు, టీడీపీ కూటమి నాయకు లు కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన, ఎంపీడీఓ రమణయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సోమవా రం నిర్వహించారు.ఈ సమావేశానికి కూటమి పార్టీలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. ముందుగా శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. మండల వ్యవసాయశాఖ అధికారి రామ్‌ప్రసాద్ మాట్లాడుతుండగా పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు లేచి యూరియా పంపిణీ అంశంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైతులందరికీ సమానంగా యూరియా అందించాల్సిన అధికారులు కూటమి నాయకుల వత్తిళ్లకు తలొగ్గారని మండిపడ్డారు. కూటమి నాయకులు సూచించిన వారికే యూరియా అందజేశారని, అదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో అధికారులు అమ్ముకున్నారని ఆరోపించారు.అనంతరం ఉపాధిహామీ పథకం ఏపీఓ జనార్దనరావు మాట్లాడుతూ ఉపాధి వేతనదారులు అంతా ఖచ్చితంగా ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. ఈకేవైసీ చేయించుకున్న వారికే పని కల్పిస్తామని తెలిపారు. అలాగే మండల విద్యాశాఖ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీలో మండలానికి ఒక్క పోస్టు కూడా మంజూరు కాలేదని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు,ఎంపీటీసీ,సర్పంచ్‌లు హాజరైయారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించండి

గజపతినగరం: గ్రామాల్లో రైతులు, ప్రజలకు జీఎస్టీ తగ్గింపులపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ సాధికారిత, సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్'పై స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యవసాయ యంత్రపరికరాలతో పాటు ట్రాక్టర్లపై జీఎస్టీ తగ్గడంతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ ఏ.నిర్మలాదేవి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.